మత్తుతో యువత బంగారు భవిష్యత్ చిత్తు

వెల్దుర్తి: ప్రభుత్వ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

పాపన్నపేట: విద్యార్థులతో అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్‌గౌడ్

నర్సాపూర్: మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ జాన్‌రెడ్డి

- మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన
- కరపత్రాలు ఆవిష్కరించిన జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది

మత్తుపదార్థాలతో విద్యార్థుల బతుకులు చిత్తవుతున్నాయని, యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందని పలువురు పోలీస్ అధికారులు అంటున్నారు. డ్రగ్స్ నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థిని విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని చదువుపై శ్రద్ధవహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఆపద సమయంలో డయల్ 100 కాల్ చేయాలని, ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు షీటీంలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని, గుర్తు తెలియని వ్యక్తులు డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడితే 1908కు సమాచారం అందించాలని సూచించారు. -పాపన్నపేట/వెల్దుర్తి/నర్సాపూర్/రామాయంపేట/శివ్వంపేట/చిన్నశంకరంపేట, జూన్ 24

రామాయంపేట: నషా ముక్త్ భారత్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలల పరిరక్షణ సిబ్బంది

శివ్వంపేట: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట: మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రెండు రోజులుగా నిలిచిన ఇంటర్నేట్ సేవలు

చిన్నశంకరంపేట, జూన్ 24: రెండు రోజులుగా ఇంటర్నేట్ సేవలు అందుబాటులో లేక భూభారతి రిజిస్ట్రేషన్ సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో రెండు రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా సేవలు పునఃరుద్ధరణ కాకపోవడంతో రైతులు వెనుదిరిగారు. ఇంటర్నేట్ సేవలు అందుబాటులో లేకపోతే స్లాట్‌లు ఎందుకు కేటాయించారంటూ అధికారులపై రైతులు మండిపడ్డారు. ఈ విషయమై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజును వివరణ కోరగా ఇంటర్‌నెట్ సరిగ్గా రాకపోవడం వల్లే భూభారతి సేవలు నిలిచిపోయాయన్నారు. సంబంధిత ఇంటర్‌నెట్ సభ్యులకు ఫిర్యాదు చేశామని, బుధవారం ఉదయం వరకు సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. రెండు రోజులుగా స్లాట్‌బుక్ చేసుకున్న వారికి ముందుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం మారుతి

రామాయంపేట, జూన్ 24: ఎస్‌బీఐ బ్యాంకులో రూ. 2వేలతో ఖాతాదారులు బీమా చేసుకోవాలని ఎస్‌బీఐ ఆర్‌ఎం మారుతి తెలిపారు. ఒకవేళ ప్రమాదంలో మృతిచెందితే వారి కుటుంబానికి రూ. 40లక్షలు బీమా చెక్కులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రామాయంపేట ఎస్‌బీఐ బ్యాంకులో ఇటీవల ప్రమాదంలో మృతిచెందిన చేగుంట మండలానికి చెందిన సీఆర్‌పీ రమేశ్ కుటుంబానికి రూ.40లక్షల ప్రమాద బీమా చెక్కును అందించారు. ఎస్‌బీఐ ఖాతా ఉన్న ప్రతీ ఒక్కరు ఈ పాలసీని తీసుకోవాలన్నారు. కేవలం రూ.2వేలు కడితే ప్రమాద బీమా డబ్బులు రూ.40లక్షలు వస్తాయన్నారు. ఎస్‌బీఐ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు ఎస్‌బీఐ బ్యాంకు అండగా ఉంటుందన్నారు. బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నాయకులు

నిజాంపేట,జూన్24: రైతుభరోసా పథకంలో భాగంగా రైతువేదికల్లో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిజాంపేట రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి నాయకులు, రైతులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, ఏవో సోమలింగారెడ్డి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, బాబు, రమేశ్, మహేందర్, నసీరోద్దిన్, వెంకటేశం, నాగరాజు పాల్గొన్నారు.

పలు చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

మెదక్ అర్బన్,జూన్24: జిల్లా కేంద్రంలోని తారాకరామనగర్ కాలనీలో చోరీ కేసులో ఇద్దరు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... తారాకరమానగర్ కాలనీలో నివసిస్తున్న కూర శేకర్ ఈనెల 8న గుడాల తిలక్, గుడ్డు రాజు వెల్కమ్ బోర్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పారిపోతూ కనిపించాడు. పోలీసులు వెంబడించి పట్టుకోగా చోరీ వివరాలు వెలుగుచూశాయి. నిందితుల నుంచి 4.50 కేజీల వెండి వస్తువులు, 5 గ్రాముల బంగారు ఉంగారం, 3 కెమెరాలు, ఒక ఫోన్, ఐపాడ్, 326 అమెరికాన్ డాలర్స్, ఒక సాంట్రో కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కేసులో ఒక బాల నేరస్తుడిని ఈ నెల 19న జువైనల్ బోర్డుకి పంపించినట్లు తెలిపారు. మరో నిందితుడిని కోదాడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెసోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు

భూపతితో మాట్లాడుతున్న మల్లేశంగౌడ్

వెల్దుర్తి, జూన్ 24. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు కాకుండా కాంగెసోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ అర్హులైన వారికి అన్యాయం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని మానేపల్లికి వచ్చిన మల్లేశంగౌడ్‌ను గ్రామానికి చెందిన భూపతి, యాదగిరి కలిసి తమ ఇళ్ల పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా మల్లేశంగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్న ఇళ్లను కూలగొట్టి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసుకొని కట్టుకుంటున్నారని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెపుతారన్నారు. వీరివెంట నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

శివ్వంపేట, జూన్ 24 : కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్ అసోసియేషన్ల జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలును రద్దుచేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఉద్యోగభద్రత కల్పించి, 8గంటల పనిదినాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో కార్మికులు బిక్షపతి, అశోక్, వెంకటయ్య, కిష్టయ్య, చంద్రయ్య, నర్సింహులు, కృష్ణ తదితరులు ఉన్నారు.

మెమోలు ఇచ్చుడు బంజేసి గ్రామానికి నిధులివ్వండి

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్,జూన్24: కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ సెక్రటరీలకు మెమోలు ఇచ్చుడు బంజేసి గ్రామాల పారిశుద్యానికి నిధులు, గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు అందించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రెస్‌నోట్‌ను విడుదల చేస్తూ మంగళవారం మండలపరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో చెత్త ట్రాక్టర్‌ను ఎందుకు వాడడం లేదనే విషయాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. డీపీవో పంచాయతీ సెక్రటరీకి మెమో జారీచేయడం దారుణమని మండిపడ్డారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర వ్యాప్తంగా కార్యదర్శులందరు ట్రాక్టర్ నడపలేమని ట్రాక్టర్ తాళాలు ఎంపీడీవోలకు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. జీపీలకు నిధులు ఇవ్వడం చేతకాక కార్యదర్శులకు మెమోలు జారీచేయడం సిగ్గుచేటన్నారు. చిప్పల్‌తుర్తి జీపీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శికి సంఘీభావం తెలుపుతూ సమస్యలు పరిష్కారయ్యేవరకు అండగా ఉంటామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిన్నారం, జూన్ 24 : జిన్నారం మండల కేంద్ర సమీపంలోని గిరిజన గురుకుల కళాశాలలోనీ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిపోయిన సీట్లకు ఎస్టీ విద్యార్థులు ఈనెల 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

మెదక్, జూన్ 24 : ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ హాల్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఎం.వి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్‌వో భుజంగరావు, షెడ్యూల్డ్ కులాల అధికారి, ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, కె.నీలాదేవితో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, సర్వీస్ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ కేసులు పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రతినెలా,మూడు నెలలకోసారి జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని, శాఖల వారిగా అధికారులు పాల్గొనాలని సూచించారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహణపై కార్యాచరణ తయారు చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి విచారణ లేకుండా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు మంజూరైన యూనిట్లకు సబ్సిడీ నిధుల మంజూరుకు కృషిచేయాలని సూచించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని సీఎం కలెక్టర్ల సమావేశంలో ఎస్సీ ఎస్టీ పథకాలపై చర్చించి వారి అభివృద్ధి సంక్షేమంపై దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లాలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి స్థలం పరిశీలించామన్నారు. ఈప్రక్రియ త్వరగా పూర్తిచేసి ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అంబేద్కర్ భవన్ నాలెడ్జ్ సెంటర్‌గా అందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దామని తెలిపారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ విషయంలో మున్సిపల్ కౌన్సిల్‌తో సంప్రదించి మున్సిపాలిటీ ఆదాయ మార్గాలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజీవ్ యువ వికాస పథకాని సంబంధించిన దరఖాస్తులు స్వీకరించామని ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే గ్రౌండింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న శోభన్

చేగుంట,జూన్ 24: రైతు సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి శోభన్ అన్నారు. మండలకేంద్రంలోని చేగుంటలో మంగళవారం రైతు సంఘం మండల సదస్సును కాశబోయిన భాస్కర్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతాంగ సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న నిర్లక్ష్యంపై రైతులకు అవగాహన కల్పించారు. 2024లో రైతు భరోసా పథకం ఇవ్వలేదని, ఎకరాకు 7,500 ఇస్తామని, 6వేలకు తగ్గించిందని, రైతుబీమా అందించాలన్నారు. నాణ్యతలేని విత్తనాలతో రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. వ్యవసాయశాఖ సంబంధిత మంత్రులకు, బ్యాంకర్లకు సమన్వయం లేక వ్యవసాయ రుణాలను బ్యాంకులు తగ్గించి ఇస్తున్నాయని దీంతో ప్రైవేటు రుణాలపై ఆధారపడి వ్యవసాయం సాగుతో రాష్ట్రంలో రోజు రోజుకు రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 72లక్షల మంది రైతులు ఉండగా45 లక్షల మందికి మాత్రమే రుణాలు అందుతున్నాయని, పంటలబీమా లేక రైతులు నష్టపోతున్నారని, రైతులు పండించిన అన్నిరకాల పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల వద్దకు వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలులో జాప్యంతో ఆకాల వర్షాల ధాటికి రైతులు నష్టపోతున్నారన్నారు.

మండల అధ్యక్షుడిగా భాస్కర్...

అనంతరం తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి శోభన్,మెదక్ జిల్లా కార్యదర్శి మద్ది లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో చేగుంట మండల అధ్యక్షుడిగా రాంపూర్‌కు చెందిన కాశబోయిన భాస్కర్,కార్యదర్శిగా చేగుంటకు చెందిన అయిత దివాకర్, ఉపాధ్యాక్షులుగా సాయికుమార్, చౌడం నరేందర్, బక్క దశరథం, సత్తెమ్మ, స్వామి, ప్రశాంత్, రుణావత్ బాబియా, తుమ్మల యాదగిరి తదితరులు ఎన్నికయ్యారు.

ఇటుకబట్టీ నిర్వహకులకు నోటీసులు



నోటీసులు అందజేస్తున్న అధికారులు

శివ్వంపేట, జూన్ 24: శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇటుకబట్టీలు నిర్వహిస్తున్న యజమానులకు మైనింగ్‌శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం నోటీసులు అందించారు. దాదాపు 15 మంది ఇటుకబట్టీల నిర్వహకులకు నోటీసులు అందించినట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. వారం రోజుల్లో నిర్వహకుల వద్దనున్న అనుమతులు అన్ని చూపించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఆర్ఐ సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ లక్ష్మణ్, ఆర్ఐ కిషన్, సర్వేయర్ అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక విద్యాభివృద్ధికి కృషిచేయాలి



సీఆర్‌పీలకు సూచనలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

సిర్గాపూర్, జూన్ 24: గ్రామాల్లో ప్రాథమిక స్థాయి విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంఈవో నాగారం శ్రీనివాస్ మండల ఎంఐఎస్, సీఆర్‌పీలకు సూచించారు. మంగళ వారం వారికి స్థానిక మండల వనరుల కేంద్రంలో వారికి సమావేశపరిచి ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధన, అభ్యాసనాభివృద్ధి పట్ల సమీక్షించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం లోగో ఉండాలని చెప్పారు. బాధ్యత తో నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్

కౌడిపల్లి, జూన్ 24: ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ మంగళవారం మండలంలోని వెల్మకన్న గ్రామ మాజీ సర్పంచ్ కాజిపేట రాజేందర్ నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డికి వినతిపత్రం అందించారు. గ్రామ శివారులో ని 447 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కౌడిపల్లికి చెందిన మోతీలాల్ గౌడ్ కబ్జా చేస్తున్నాడని మండల రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ భూమిలో చెట్లు రాళ్లను తొలగించి కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమి పట్టా పొందితే విచారణ జరిపి పట్టాను రద్దుచేస్తామని హామీ ఇచ్చినట్లు రాజేందర్ తెలిపారు. రైతుసంఘం నాయకుడు చంద్రశేకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిషనర్ల నియామకం

జిన్నారం, జూన్ 24 : మండలంలోని బొల్లారం, గడ్డపోతారం మున్సిపాలిటీల కమిషనర్లుగా కిషన్, వెంకటరామయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఇద్దరు నూతన కమిషనర్లు పదోన్నతిపై మున్సిపాలిటీలకు రానున్నారు. ఒకటి రెండు రోజుల్లో నూతన కమిషనర్లు బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలి

- మానసికోల్లాసానికి ఆటలు దోహదం చేస్తాయి
- అర్చరీ, ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించిన సీఐ వెంకటరాజ గౌడ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ

రామాయంపేట, జూన్ 24: క్రీడలు శారీక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని, క్రీడలపై ప్రతి ఒక్కరూ మక్కువ చూపాలని రామాయంపేట సీఐ.వెంకటరాజగౌడ్ అన్నారు. మంగళవారం రామాయంపేట కళాశాల మైదానంలో క్రీడా దినోత్సవం సందర్భంగా విలువిద్య, పుట్‌బాల్ తదితర క్రీడలను ప్రారంభించారు. మెదక్ జిల్లాలోనే రామాయంపేట మండలానికి ఎంతో ప్రత్యేకత ఉందని ఇక్కడి నుంచి ఎంతో మంది విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని కలిగి పథకాలు సాధిస్తున్నారన్నారు. ఇందుకు యువజ్యోతి క్లబ్ నిర్వాహకుడు బొంత సత్యనారాయణ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. అర్చరీ, పుట్‌బాల్, విలువిద్యలో ఎక్కువ శాతం విద్యార్థులు రామాయంపేట నుంచే జాతీయ పథకాలు సాధిస్తున్నారన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో రామాయంపేట ఎస్సై.బాలరాజు, నిర్వాహకులు బొంతల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

హక్కుల కోసం యాదవుల పోరాటం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామాయంపేట, జూన్ 24: హక్కుల కోసం యాదవులు పోరాటం చేయాలని బీసీ జన సభ వ్యవస్థాపక అధ్యక్షుడు, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు రాజారాం యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేటలో యాదవుల హక్కుల పోరాటం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే యాదవుల ఆత్మగౌరవ సభను రాష్ట్రవ్యాప్తంగా యాదవులు విజయవంతం చేయాలని కోరారు. యాదవులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. యాదవులకు చట్టసభల్లో నామినేటెడ్ పోస్టులు కేటాయించాలన్నారు. మంత్రి పదువుల్లో సరైన స్థానం కల్పించాలన్నారు. యాదవుల కార్పోరేషన్‌కు రూ.10కోట్లు నిధులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మేకల కృష్ణ, పూలపల్లి యాదగిరి, పూడెం దేవరాజు, బసన్నపల్లి రాజు యాదవ్, మల్లయ్య, బత్తుల రాజు, రవి, శ్రీశైలం, రాములు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



బత్తుల దేవమ్మ (ఫైల్)

రామాయంపేట, జూన్ 24: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన ఘటన రామాయంపేట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసు కథనం ప్రకారం.. పురపాలిక పరిధిలోని ఎక్కలదేవి బండ జాతీ య రహదారి పక్కన పూరిగుడిసెల్లో నివసిస్తున్న బత్తుల దేవమ్మ(57) సోమవారం రాత్రి రోడ్డుపై నుంచి నీళ్లబిందెతో దాటుతుండగా హైదరాబాద్ నుంచి బైక్‌పై వేగం గా వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి దేవమ్మను వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయాడు. స్థానికులు గమనించి తీవ్రగాయాల పాలైన మహిళను మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించామని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించిన ట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి మృతి..

పాపన్నపేట, జూన్ 24: వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలకేంద్రంలోని పాపన్నపేట శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. పెద్దశంకరంపేట మండలం జుక్కల్ గ్రామానికి చెందిన మచుకూరి లక్ష్మయ్య(67) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం టీవీఎస్ బండిపై బంధువుల ఇంటికి వెళి తిరిగి వస్తుండగా పాపన్నపేట శివారులోకి రాగానే వెనుక నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు సంగమేశ్వర్ ఫిర్యాదుతో కేసు నమోచేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

నేడు రామాయంపేటలో ఉచిత నేత్రవైద్య శిబిరం

రామాయంపేట, జూన్ 24: రామాయంపేట పట్టణంలోని ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎంఆర్ దవాఖాన నిర్వాహకులు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శంకర్ కంటివైద్యులు బుధవారం పట్టణంలోని ఎన్‌ఎంఆర్ (పాత దుర్గాబాయి) దవాఖానాలో శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడేవారు ఈ శిబిరంలో పాల్గొని చికిత్స తీసుకోవాలన్నారు. వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందిస్తామన్నారు. రామాయంపేట పట్టణంతో పాటు పరిసర మండలాల ప్రజలు వైద్యశిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT: AT: NARSAPUR
O.S.No. 129 OF 2023
BETWEEN:
Ali Bin Naser ...Plaintiff
AND
1. Hassan Bin Ahmed
2. The Tahsildar, Narsapur
3. All concerned ...Defendants

Please take notice that the above suit has been filed against Defendants for Declaration to declare the plaintiff are only surviving legal heir of Late Md. Bin Ahmed, S/o. Late Ahmed Bin Mohammed was died on 17/6/2006 at Gandhi Hospital, New Bhoiguda, Secunderabad and consequently to declare the plaintiffs are the owner of suit schedule property being the legal heir of deceased late Late Md. Bin Ahmed. The suit schedule property All that the Agriculture land admeasuring 0.07 guntas in survey No. 149, admeasuring 0.18 guntas in survey No. 150 & admeasuring 0.20 guntas in survey No. 151, Total land admeasuring Ac. 1.05 guntas, situated at Avancha Village, Narsapur Mandal, Medak District with boundaries NORTH: ROAD, SOUTH: JAGANPET YADAIAH, EAST: VASHYA, WEST: LAND OF ASANBIN AHMED and the same is posted on 22-07-2025. If any person/s having any objection/claims kindly appear either in person or through an advocate in the above said court at 10-30 a.m. on the above said date, as otherwise the matter will be decided accordingly.
// By Order of Court //
Smt. D.MANJU DHANA LAXMI, SAIRAM ANUSHA, Advocates
LIG 154, Above Ushodaya Super Market, Housing Board, Moulali, Hyderabad-40.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
SCRAP FOR SALE
★ Tenders are invited from the parties who are granted Registration by Pollution Control Board for lifting the Scrap (Cut Belts, Nitrile Flash, Polyester Cord, Scorched Compound, Damaged Oil Seals, Moulded Rubber Products, MS Plastic Barrels, Plastic Carbouys, Polythene Waste, Oil, MS Scrap, Wood, Kachara Scrap & Other Misc.) on Daily basis. Interested parties may Contact the undersigned for inspection. Last date of submission 28-06-2025. Contact: Manager (Materials), J.K. Fenner (India) Limited, 4 & 22, IDA, Phase IV, Patancheru-502 319, Phone: 08455242636, 9908153792.
NT-Par

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.